

డెంగీ నివారణకు చర్యలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): డెంగీ వ్యాధి ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జాతీయ డెంగీ మాసోత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి నిల్వలు ఎక్కడుంటే అక్కడ దోమలు వృద్ధి చెందే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందడం ద్వారా డెంగీ,మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. నీటి నిల్వలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, మలేరియా నియంత్రణాధికారి నూకరాజు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సమస్యలు పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో నిర్వహించిన అంశాల వారీగా చర్చించారు. ఆసుపత్రిలో విద్యుత్ సమస్య ఉండరాదని, ఏఎంసీ, గైనిక్ ఓటీ, సూపర్‌స్పెషాలిటీ ఓటీల్లో యూపీఎస్ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, పీజీ హాస్టల్ వద్ద స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓల్డ్‌సిటీ వాసులకు ఉపయోగపడే గడియారం ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పలువురు డాక్టర్లు మందులు బయటకు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రాల పనితీరుపై ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, వైద్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కర్నూలు(హాస్పిటల్): డేనియల్ రాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుమన్ సోమవారం తన తండ్రి జ్ఞాపకార్థం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలకు రూ.5 లక్షల ప్రమాద బీమా అందించారు. శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు


విమలమ్మను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు


శ్రీనివాస ప్రసాద్‌ను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): 40 ఏళ్ల పాటు వివిధ స్థాయిల్లో వైద్య సేవలు అందించిన నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 విమలమ్మను ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రిలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ఘనంగా సన్మానించారు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జి.సుధాకర్, డాక్టర్ లక్ష్మీబాయి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 సావిత్రిబాయి, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీనివాస ప్రసాద్ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కృష్ణానగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సభలో శ్రీనివాస ప్రసాద్ దంపతులను కర్నూలు ఉప కమిషనర్ పట్టెం గురు ప్రసాద్, ఆ శాఖ అధికారులు రామాంజనేయులు, విజయరాజు, సతీష్, మాధవశెట్టి, తదితరులు ఘనంగా సన్మానించారు

ఆర్‌డబ్ల్యూఎస్ సీసీ డీఈఈగా మధుసూదన్



కర్నూలు(అర్బన్): గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉమ్మడి జిల్లా క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా బీవీ మధుసూదన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ డీఈఈగా ఉన్న కుష్ కుమార్‌రెడ్డి పదవీ విరమణ చేసిన సందర్భంగా మధుసూదన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయన నేడు బాధ్యతలు చేపట్టనున్నారు.

బాలిక చదువుకు చేయూత

కర్నూలు(సెంట్రల్): ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన నిర్మల చదువుకు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చింది. సోమవారం జేసీ డాక్టర్ బి.నవ్య సమక్షంలో ఆ సంస్థ చైర్మన్ కృష్ణ ప్రదీప్ మార్గదర్శిగా ఉంటూ ఆ బాలిక డిగ్రీ చదువుతోపాటు వసతి, ఐఏఎస్ శిక్షణ ఉచితంగా ఇవ్వనున్నట్లు పత్రం అందజేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం సుర్జీత్ భవన్‌లో ఏపీ భవన నిర్మాణ కార్మిక ఓల్డ్‌సిటీ సంఘం మూడో మహాసభలను నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సీఐటీయూ జెండాను డి.గౌస్‌దేశాయ్ ఆవిష్కరించి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని కోరారు.అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.నాగరాజు, కార్యదర్శిగా ఖాజాపాషా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కల్లూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం 2వ వార్డుకు చెందిన యువకులు ఈశ్వర్, భరత్ వారి మిత్ర బృందం వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా భృతి ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నేతలు దినేష్, నరేంద్ర, వివేక్, తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం


ఎంఎం దాసును సన్మానిస్తున్న ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం


తిరుమలనాయుడును సన్మానిస్తున్న డీఆర్వో వెంకట నారాయణమ్మ

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని డీఆర్వో కార్యాలయంలో రికార్డు అసిస్టెంటుగా పనిచేసి పదవీ విరమణ పొందిన తిరుమలనాయుడును రెవెన్యూ భవనలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. అలాగే కర్నూలు జిల్లా వెల్దుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఎంఎం దాసును ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో జూలై 28, 29, 30 తేదీల్లో నిర్వహించే సీపీఐ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం పిలుపునిచ్చారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నిరుపేదలకు కూడు, గుడ్డ పేరుతో సీపీఐ దశాబ్దాలుగా పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, నాయకులు బీసన్న, భద్ర కుమార్, ఈశ్వర్, గిడ్డమ్మ, వెంకటేస్,నల్లన్న పాల్గొన్నారు.